

సత్వర న్యాయం చేస్తాం: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై వచ్చే బాధితులకు చట్టపరిధిలో సత్వర న్యాయం చేకూరుస్తామని జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహిం చారు. బాధితుల నుంచి 70 ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలకు అక్కడిక క్కడే పరిష్కారం చూపేలా సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్య పరిష్కారంపై వారికి ఆదేశాలు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఫిర్యాదు లు పునరావృతం కాకుండా చూడాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని హెచ్చరించారు. ఎక్కువ ఫిర్యాదు కుటుంబ కలహాలు, భూ సమస్యలు, ఆర్థికమోసాలు, ఆస్తి పంపకాలు, సైబర్‌నేరాలు వంటివాటిపై వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, లీగల్‌సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదుదారితో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

బావి... భయం..!

పెనుకొండ-అనంతపురం పాత 44వ నంబరు జాతీయ రహదారిలో.. పెనుకొండ-తిమ్మాపురం మధ్య రోడ్డు పక్కనే ఉంది ఈ బావి. ఇక్కడికి సమీపంలో హంద్రీనీవా కాలువ ఉంది. ఈ కారణంగా మండు వేసవిలోనూ బావిలో నిండుగా నీరు ఊరింది. బావి చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఈ నీటిని ఎవరూ వినియోగించడం లేదు. దీంతో పాచిపట్టింది. అధికారులు స్పందించి చుట్టూ రక్షణ గోడ నిర్మించి, ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన అవసరం ఉంది. పురాతన సంపద అయిన ఈ బావిని శుభ్రపరిచి, మరమ్మతులు చేయిస్తే.. నీటిని స్థానికులు వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

- ఆంధ్రజ్యోతి, పెనుకొండ టౌన్



కార్యకర్తకు బొలెరో బహుమతి

తాళాలు అందించిన మంత్రి సవిత



ఐ-టీడీపీ కార్యకర్త మద్దిలేటికి బొలెరో తాళాలు అందజేస్తున్న మంత్రి

సోమందేపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఐటీడీపీ కార్యకర్త మద్దిలేటికి మంత్రి సవిత బొలెరో వాహనాన్ని బహుమతిగా ఇచ్చారు. వాహనం తాళాలను ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద అందించారు. అనంతరం ఆమె స్వయంగా వాహనాన్ని నడిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సోమందేపల్లిలో అంగడి పెట్టుకుని జీవిస్తున్న మద్దిలేటిపై వైసీపీ నాయకులు కక్షగట్టారన్నారు. అధికారం అండతో అతడి అంగడిని తొలగించి ఉపాధి లేకుండా చేశారన్నారు. గత ఎన్నికల సందర్భంగా స్థానిక నాయకులు అతడి పరిస్థితిని తన దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. దీంతో ఆదుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే బొలెరో వాహనాన్ని అందించినట్లు తెలిపారు. పార్టీకి కార్యకర్తలే పునాదులని, వారు లేనిదే పార్టీ మనుగడ లేదన్నారు. పార్టీకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు డీవీ ఆంజనేయులు, నీరుగంటి చంద్ర, సూరీ, వెంకటేశులు, వెంకటరమణ, సర్పంచ్ నరసింహులు, ఆకుల రమణ, కిష్టప్ప, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సరళకు జాతీయస్థాయి ఉగాది పురస్కారం



ధర్మవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన జానపద గాయకురాలు సోమిశెట్టి సరళ 2025 సంవత్సరానికి జాతీయ స్థాయిలో ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. తిరుపతి సిటీ చాంబర్ 28వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ఠ సేవలు అందించిన వారికి 2025 ఉగాది పురస్కారాలు ప్రకటించారు. కళారంగానికి సంబంధించి తాను ఎంపికైనట్టు సరళ పేర్కొన్నారు. ఈనెల 27న తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో జరిగే వేడుకల్లో టీటీడీ సౌజన్యంతో ఈ పురస్కారాన్ని అందుకోనున్నట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు తనకు ఆహ్వానం అందిందని ఆమె పేర్కొన్నారు.

దొంగ బండ్లు..!

- రైతులు, యువతే లక్ష్యంగా విక్రయాలు
- పట్టణాల్లో చోరీ.. పల్లెల్లో అమ్మకాలు
- కొనేటప్పుడు జాగ్రత్త.. లేదంటే కష్టాలు



హిందూపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దులో ఉండడంతో హిందూపురం ప్రాంతంలోకి దొంగ బండ్లు విచ్చలవిడిగా వస్తున్నాయి. అక్కడ చోరీ చేసిన వాహనాలను దొంగలు హిందూపురం ప్రాంతంలో విక్రయిస్తున్నారు. ఆరు నెలల క్రితం హిందూపురం మండలంలోని కొటిపి పంచాయతీలో ఒక రైతు పట్టణంలో ద్విచక్రవాహనాలు విక్రయించే వ్యక్తిని ఆరా తీశాడు. అతడిచ్చిన సమాచారంతో ఓ వ్యక్తి నుంచి ఏడాది గడిచిన వాహనం కొనుగోలు చేశాడు. మార్కెట్లో కంటే సగానికి సగం తగ్గించి ఇచ్చాడు. రికార్డులు అడిగితే తరువాత ఇస్తానని చెప్పాడు. తరువాత రెండు నెలలకే కర్ణాటక పోలీసులు వచ్చి ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లారు. ప్రశ్నిస్తే నీవు కొనుగోలు చేసింది దొంగ బండి అని చెప్పారు. నాలుగు నెలల క్రితం లేపాక్షి మండలానికి చెందిన ఓ విద్యార్థి ద్విచక్రవాహనం కావాలని తల్లిదండ్రులతో పట్టుపట్టాడు. చేసేది లేక గౌరీబిదనూరుకి వెళ్లి ద్విచక్రవాహనాన్ని బంధువుల ద్వారా కొనుగోలు చేశారు. ఆ విద్యార్థి నెల క్రితం బంధువుల ఊరని గౌరీబిదనూరుకి వెళ్లగా అక్కడ ఉన్న తూమకూరు పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ విద్యార్థికి దిక్కుతెలియక బంధువులకు ఫోన్ చేసి సమాచారమిచ్చాడు. వారు వచ్చి పోలీసులను అడుగగా మీరు చోరీ చేసిన వాహనాన్ని కొనుగోలు చేశారని, మీరు కూడా స్టేషన్‌కి రావాలని అన్నారు. ఆరు నెలల క్రితం చిలమత్తూరు పంచాయతీకి చెందిన ఓ చిరువ్యాపారి బాగేపల్లిలో తక్కువ ధరకు వస్తుందని ద్విచక్రవాహనాన్ని కొనుగోలు చేశాడు. ఆ వాహనానికి సంబంధించిన జిరాక్స్ పత్రాలను అందించాడు. రెండు నెలల క్రితం పని మీద చిక్కబళాపుర వెళ్లి వాహనాన్ని ఓ హోటల్ వద్ద పార్కు చేసి ఉండగా, దానిని అక్కడున్న పోలీసులు తీసుకెళ్లారు. కొద్ది సేపు తరువాత బయటికి వచ్చి చూడగా వాహనం కనపడలేదు. సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు ఎత్తుకెళ్లారని హోటల్ నిర్వాహకులు తెలిపారు. అది దొంగలించిన వాహనమని తేలింది. రెండు నెలల క్రితం హిందూపురం పట్టణంలోని ఓ ఉద్యోగి తక్కువ ధరకు వచ్చిందని అపాచీ వాహనం కొనుగోలు చేశాడు. వారానికే ఆ వాహనం దొంగలించిన వ్యక్తి పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు వచ్చి ద్విచక్రవాహనం తీసుకెళ్లారు. ఇలాంటి దొంగ వాహనాలు కొనుగోలు చేసిన వారు సరిహద్దు పల్లెల్లో వందల సంఖ్యలో ఉన్నారు. వీరంతా తక్కువ ధరకే వాహనం దొరుకుతుందని మోసపోయినవారే. కొత్తచెరువు ప్రాంతానికి చెందిన ఓ ద్విచక్రవాహనాల దొంగ గత ఏడాది 15 వాహనాలను చోరీ చేసి విక్రయించాడు. వాహనం తీసుకెళ్లిన చోట సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగను గుర్తించి 10 వాహనాలను రికవరీ చేశారు. దొంగ వాహనాలను కొనుగోలు చేసిన వారిలో రైతులు, యువకులు, చిరువ్యాపారులే ఎక్కువగా ఉన్నారు. ఇవన్నీ పోలీసుల విచారణలో తేలినవి.

రైతులు, యువకులే లక్ష్యం

దొంగ వాహనాలు కొనుగోలు చేయడంలో రైతులు, యువకులు, చిరువ్యాపారులే అధికంగా ఉన్నట్లు పోలీసుల విచారణలో తెలుస్తోంది. తక్కువ ధరకు దొరకుతాయని భావించి కొనుగోలు చేస్తున్నారు. దొంగలు వాహనాలను రెండు మూడు రోజుల్లోనే విక్రయిస్తారు. మరికొంత మంది చోరీ చేసిన వాహనాలను తాకట్టుపెట్టి డబ్బులు తీసుకుంటుంటారు. తాకట్టుపెట్టిన వాహనాలను తరువాత వారు విడిపించుకోరు. సెకండ్ హ్యాండ్ వాహనాలను విక్రయించే చోటే వాటిని అధికంగా విక్రయిస్తారు. దొంగ వాహనాలు కొనుగోలు చేసిన తరువాతే వారికి అసలైన కష్టాలు ఎదురవుతాయి.

తక్కువ ధర అని ఆశతో...

చాలా మంది రైతులు, యువకులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు తక్కువ ధరకే ద్విచక్రవాహనం దొరుకుతుందని ఆశతో కొనుగోలు చేస్తారు. మరికొంత మంది మధ్యవర్తుల నమ్మకంతో ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేస్తుంటారు. అన్నింటికి మించి ధర తక్కువంటే ఏదైనా కొనుగోలు చేయడానికి ముందుకు వస్తారు. అది దొంగ వాహనమా అని ఆలోచించరు. చివరికి రెండు విధాలా నష్టపోతున్నారు.

సరైన పత్రాలతో కొనుగోలు చేయాలి

షోరూంలో కాకుండా బయట సెకండ్ హ్యాండ్ వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. దొంగలించిన వాహనాలను తక్కువ ధరకు అమ్ముతుంటారు. అసలైన యజమాని అయితే తక్కువ ధరకు విక్రయించరు. ఒరిజినల్ పత్రాలను చూపించిన తరువాతే కొనుగోలు చేయాలి. గుర్తు తెలియని వ్యక్తులు అమ్మేందుకు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.



-మహేష్, డీఎస్పీ, హిందూపురం

పట్టణాల్లో చోరీ.. పల్లెల్లో విక్రయం

ద్విచక్రవాహనాల చోరీ పట్టణాల్లోనే ఎక్కువగా ఉంటుంది. కొందరు దొంగలు జల్సాలకు అలవాటు పడి ముఠాగా ఏర్పడి చోరీలు చేస్తుంటారు. రద్దీగా ఉండే ప్రాంతాలను ఎంచుకొని వాహనాలను తస్కరిస్తారు. కొన్నిసార్లు అపహరించిన వాహనాల విడిభాగాలను అమ్మి సొమ్ము చేసుకుంటారు. ఎక్కువగా పట్టణాల్లో చోరీ చేసి పల్లెల్లో విక్రయిస్తుంటారు. తక్కువ ధరకు దొరుకుతాయంటే రైతులు, యువత ఎక్కువగా ఉత్సాహం చూపుతుంటారు. తరువాత పోలీసులు వచ్చి వాహనాన్ని తీసుకెళ్లి స్టేషన్‌కి పిలిపించినప్పుడు మోసపోయామని ఆవేదన చెందుతుంటారు.

ఖర్చులకూ కటకట..!

బడ్జెట్ ఆమోదం లేక ఇబ్బందులు
మూడు నెలలుగా ఊసేలేని కౌన్సిల్ సమావేశాలు
టైటిల్ ట్రాన్స్‌ఫర్‌కు ఆమోదం లేక రూ.3 కోట్ల నష్టం
కదిరి మున్సిపాలిటీలో దయనీయ పరిస్థితులు



కదిరి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా తయారయింది కదిరి మున్సిపాలిటీ పరిస్థితి. మున్సిపాలిటీలో ఖర్చులకు డబ్బులు లేక కటకటాడుతున్నారు. రోజువారీ ఖర్చులకు సైతం అప్పు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీ జనరల్‌ఫండ్స్ ఉన్నా.. బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం లేక కనీస ఖర్చులకు డబ్బుల్లేని దుస్థితి నెలకొంది. మూడునెలలుగా కౌన్సిల్ సమావేశం జరగకపోవడం, బడ్జెట్ ఆమోదం లేకపోవడంతో ఇబ్బంది ఏర్పడింది. టైటిల్ ట్రాన్స్‌ఫర్‌కు ధరల పెంపుపై కౌన్సిల్ ఆమోదం లేక మున్సిపాలిటీకి దాదాపు రూ . మూడు కోట్ల ఆదాయం పోయిందని అధికారులు వాపోతున్నారు. మున్సిపల్ పాలక వర్గానికి కనీస ముందుచూపు లేకపోవడంతోనే ఈ గడ్డు పరిస్థితికి కారణమని తెలుస్తోంది.

మూడు నెలలుగా సమావేశాలు ఏవీ..?

మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశాలే జరగలేదు. ఈ ఏడాది జనవరి 30న చివరి సమావేశం జరిగింది. ఇప్పటికే 80 రోజులు గడిచిపోయింది. వచ్చే పదిరోజుల్లో కూడా కౌన్సిల్ సమావేశం జరిగే పరిస్థితి కనిపించ లేదు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడంతో కౌన్సిల్ సమావేశానికి అవకాశంలేదు. దీంతో మున్సిపాలిటీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోయాయి. బిల్లుల చెల్లింపులు, అత్యవసరాలకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. కౌన్సిల్ సమావేశం ఎందుకు నిర్వహించలేదో మున్సిపల్ పాలకులకే తెలియాలి. ప్రతినెలా కౌన్సిల్ సమావేశం నిర్వహించడం ఆనవాయితీ. ఆజెండాలోని అంశాలకు ఆమోదంతోపాటు కౌన్సిలర్లు తమ వార్డు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకురావడానికి అవకాశముంటుంది.

బడ్జెట్ ఆమోదం లేక కష్టాలు

కౌన్సిల్‌లో బడ్జెట్ ఆమోదం పొందితేనే మున్సిపల్ అధికారులు డబ్బులు ఖర్చు చేయడానికి అవకాశం ఉంటుంది. జనవరి 30న జరిగిన సమావేశంలో బడ్జెట్ వివరాలను కౌన్సిల్ ముందుకు తెచ్చారు. ఈ సమావేశంలో బడ్జెట్ ఆమోదించలేదు. దీంతో మున్సిపల్ అధికారులకు రోజువారీ ఖర్చులు పెట్టడానికి ఆర్థిక కష్టాలతో సతమతమవుతున్నారు. కనీసం వాహనాలకు డీజిల్ పట్టించడానికి కూడా డబ్బుల్లేని పరిస్థితి. దీంతోపాటు మున్సిపల్ వర్కర్లకు అవసరమైన కెమికల్స్ కొనుగోలు, వాహనాల మరమ్మతులకు ఇబ్బందిగా మారింది. పలుమార్లు మున్సిపల్ పాలకుల దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదని అధికారులు వాపోతున్నారు. మున్సిపల్ జనరల్ ఫండ్‌లో రూ.కోట్లు ఉన్నా.. కనీసం రూ.100 కూడా ఖర్చు చేయలేని దుస్థితి నెలకొంది.

టైటిల్ ట్రాన్స్‌ఫర్‌కు ఆమోదం లేక రూ.3 కోట్ల నష్టం

మున్సిపాలిటీ పరిధిలో ఒక ఇంటిని కొనుగోలు చేసినప్పుడు అమ్మినవారి పేరు నుంచి కొనుగోలు చేసిన వారిపేరుపైకి మార్చుకోవడం సహజం. దీనినే టైటిల్ ట్రాన్స్‌ఫర్ అంటారు. రిజిస్ట్రేషన్ విలువ రూ.10లక్షలకుపైగా ఉంటే ప్రస్తుతం రూ.5వేలు వసూలు చేస్తున్నారు. ఈ ఫీజు 2024 డిసెంబరు 31వరకు అమలులో ఉండేలా 2022లో కౌన్సిల్ తీర్మానం చేసింది. 2024 ముగియడంతో 2025లో కొత్త (ఫీజు) ధరలను కౌన్సిల్ ఆమోదించాల్సి ఉంది. ఆ మేరకు అధికారులు కూడా 2025 జనవరి 30న జరిగిన సమావేశంలో ఆజెండాలో పొందుపరిచారు. కౌన్సిల్ ఈ అంశాన్ని వాయిదా వేసింది. దీంతో టైటిల్ ట్రాన్స్‌ఫర్లు జనవరి నుంచి నిలిచిపోయాయి. ఇప్పటి వరకు దాదాపు 300కు పైగా దరఖాస్తులు టైటిల్ ట్రాన్స్‌ఫర్ కోసం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఒక దరఖాస్తుకు రూ.10వేల చొప్పున నిర్ణయించినా దాదాపు రూ.3కోట్ల వరకు మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేది. కౌన్సిల్ ఆమోదం లేకపోవడంతో ఆదాయం కోల్పోయింది.

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం



బడ్జెట్ ఆమోదం తెలపకపోవడంతో మున్సిపాలిటీలో రోజువారీ ఖర్చులకు ఇబ్బంది పడుతున్నాం. కొన్ని సమయాల్లో సొంత డబ్బుకూడా వెచ్చించాల్సి వస్తోంది. జనరల్ ఫండ్ రూ.29 కోట్లు ఉంది. కానీ, దాన్ని కూడా ఖర్చు చేయలేకున్నాం. టైటిల్ ట్రాన్స్‌ఫర్ కాకపోవడంతో రూ.3కోట్ల వరకు మున్సిపాలిటీకి జమకాలేదు. దీనికి ప్రత్యామ్నామాయ ఏర్పాట్లు చేస్తున్నాం. ఉన్నతాధికారుల అనుమతులు తీసుకుని బడ్జెట్ వినియోగించుకునేలా ప్రయత్నిస్తాం.

-కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కదిరి

పేదింటి బిడ్డలకు ప్రభుత్వ కానుక

ఆర్టీఈ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
ప్రైవేటు విద్యాసంస్థల్లో 25శాతం సీట్లు
మే 15 నుంచి 20వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం

ధర్మవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) పేదలకు కార్పొరేట్ విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టానికి(ఆర్టీఈ) సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యాహక్కు చట్టం ద్వారా పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు కేటాయించేలా ప్రభుత్వం పక్కా ప్రణాళిక సిద్ధం చేసింది. గడచిన ఐదేళ్లలో ఈ చట్టాన్ని అస్తవ్యస్తంగా అమలు చేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రైవేటు యాజమాన్యాలకు దీటుగా గత ప్రభుత్వం న్యాయపరమైన అంశాల్లో స్పందించలేదు. దీంతో విద్యాహక్కుచట్టం ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు ఫీజు చెల్లించుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ సారి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు సమగ్ర శిక్ష ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీ సత్యసాయి జిల్లాలో 524 ప్రైవేటు విద్యాసంస్థలు ఉండగా 25శాతం సీట్లు పేద విద్యార్థులకు విద్యాహక్కుచట్టం ద్వారా కేటాయించాల్సి ఉంది. ఈ చట్టం ప్రకారం అడ్మిషన్లు పొందే విద్యార్థులు ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుంది.

ఫీజు వివరాలు

ఈ పథకం ద్వారా ఒకటో తరగతిలో అడ్మిషన్ పొందిన విద్యార్థి అర్బన్ ప్రాంతంలో పాఠశాలలకు రూ.8500, రూరల్ ప్రాంత పాఠశాలలకు రూ.7500 ఫీజు నిర్ణయించారు. ఈ నామమాత్రపు ఫీజును ప్రభుత్వమే ఆయా విద్యా సంస్థలకు చెల్లిస్తుంది. విద్యార్థి ఏ క్లాసులో చదివినా అదే ఫీజు ఉంటుంది.

అర్హులు... దరఖాస్తులు ఇలా..

విద్యా హక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం పొందడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈ డబ్ల్యూఎస్, ఓసీలో విభిన్న ప్రతిభావంతులు, అనాథలు, హెచ్‌ఐవీ బాధిత తల్లిదండ్రుల పిల్లలు ఆర్టీఈ ప్రవేశాలకు అర్హులు. ఆయావర్గాల విద్యార్థులు తమ సమీపంలోని ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్సీ, స్టేట్ సిలబస్‌లో బోధన అందించే ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల ఆధార్, ఇతర ప్రాథమిక వివరాలతో హెచ్‌టీటీపీ://సీఎస్ఈ.ఏపీ..జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో మే 15 నుంచి 20లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సచివాలయాలు, మండల విద్యావనరుల కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులకు లాటరీ ద్వారా సీట్లు కేటాయిస్తారు. ఇతర సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800 42 58599 ద్వారా తెలుసుకోవచ్చని విద్యాశాఖ అధికారి తెలిపారు. మే 21 నుంచి 24లోగా మొదటి విడత అర్హుల జాబితాను విడుదల చేస్తామని తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



కిష్టప్ప (ఫైల్)

గుడిబండ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్. రాయాపురానికి చెందిన రైతు కిష్టప్ప(54) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజ కుళ్లాయప్ప సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు కిష్టప్పకు రెండెకరాల వ్యవసాయ పొలం ఉంది. వ్యవసాయం చేసేందుకు ఐదేళ్ల నుంచి సాగుకోసం అప్పులు చేశాడు. పంటలు పండక, చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి అప్పు సుమారు రూ.4.70లక్షలు అయింది. తీర్చే మార్గం కానరాక మథనపడేవాడు. ఈక్రమంలోనే ఆత్మహత్య చేసుకుంటాననిచెప్పేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. చేసిన అప్పులు తాము తీరుస్తామని భార్య, కుమారులు ఎంత చెప్పినా వినకుండా పొలం వద్ద కానుగ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వారు ఆక్రోశించారు. చుట్టుపక్కల ఉన్న రైతులు కనుగొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య ఈరమ్మ, ఇద్దరు కుమారులున్నారు. ఈరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని మడకశిర ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న బృందం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సోమవారం ఢిల్లీ నుంచి ప్రత్యేక బృందం వచ్చింది. వారు జిల్లాలో ఎంపీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ బృందం నాలుగు రోజుల పాటు జిల్లాలో ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించనుంది. తొలిరోజు నార్పలలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. అనంతరం నలప రెడ్డిపల్లి, ఆకులేడు, హెచ్ సోదనపల్లిలో గ్రామాల్లో శ్మశానాలకు ఏర్పాటు చేసిన ప్రహరీలను పరిశీలించారు. నల్లపరెడ్డిపల్లిలో గుంజేపల్లి రోడ్డు వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించారు. అనంతరం బుక్కరాయసముద్రంలోని సుందర్ నగర్‌లో నిర్మించిన సీసీరోడ్డును పరిశీలించారు. జిల్లా కేంద్రంలో రూ.25 లక్షలతో నిర్మాణం చేపట్టిన వాల్మీకి భవనం అదనపు గదులను పరిశీలించారు. కమిటీ సభ్యులు హేమంత్‌కుమార్, రాజేషతో పాటు స్థానిక అధికారులు జేఈఈ వరప్రసాద్, రమణయ్య, ఏఈఈ వెంకట శేషయ్య పాల్గొన్నారు.

యూపీ సీఎంకు నిమ్మలకుంట తోలుబొమ్మ బహూకరణ

ధర్మవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నిమ్మలకుంట తోలుబొమ్మలతోపాటు ధర్మవరం పట్టువస్త్రాన్ని బహూకరించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా మంత్రి సత్యకుమార్‌యాదవ్ సోమవారం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిమ్మలకుంట తోలుబొమ్మలు, ధర్మవరం పట్టువస్త్రాల గురించి యోగిఆదిత్యనాథ్‌కు మంత్రి వివరించారు. సీఎం కూడా మంత్రికి మధుర శ్రీకృష్ణుడి ప్రతిమను బహూకరించారు. అనంతరం ఇరువురు దేశ, రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ పథకాల అమలు, పార్టీ సంస్థాగత అంశాల గురించి చర్చించారు. తిరుమల శ్రీవారిని దర్శనం చేసుకోవాలని, ధర్మవరం నియోజకవర్గాన్ని సందర్శించాలని మంత్రి సత్యకుమార్ సీఎంను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.



యూపీ సీఎంకు నిమ్మలకుంట తోలుబొమ్మను బహూకరిస్తున్న మంత్రి సత్యకుమార్

కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాల మధ్య కేఎం జకీవుల్లా అంత్యక్రియలు
- నివాళులు అర్పించిన మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు
- పాడెమోసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి
- అంతిమ యాత్రలో పాల్గొన్న వందలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు




నివాళులు అర్పిస్తున్న పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు




ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఎంపీ అంబికా, రాష్ట్ర కార్యదర్శి ఆలం

అనంతపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడు కేఎం సైపుల్లా తనయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేఎం జకీవుల్లా అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య సోమవారం పూర్తయ్యాయి. మధ్యాహ్నం రాంనగర్‌లోని సైపుల్లా నివాసం నుంచి రాంనగర్ ఫ్లైఓవర్ మీదుగా అశోక్ నగర్‌లోని ఖబరస్తాన్ వరకు వందలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అంతిమ యాత్ర సాగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్.. జకీవుల్లా పాడె మోసి ఆయనతో వారికున్న అనుబంధాన్ని చాటారు.

ఘన నివాళి

జకీవుల్లా ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గుండెపోటుతో మృతి చెందగా... ఆయన పార్థివ దేహాన్ని ఆదివారం అర్ధరాత్రి రాంనగర్‌లోని ఆయన నివాసానికి తీసుకొచ్చారు. సోమవారం ఉదయం పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు అక్కడికి చేరుకున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి జకీవుల్లా పార్థివ దేహంపై టీడీపీ జెండా కప్పి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్ రాజు, పల్లె సింధూరరెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లె రఘునాథ్ రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, యామిని బాల, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పేరం నాగిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, బాంబేడైయింగ్ నాగన్న, సరిపూటి సూర్యనారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ కేఎం జకీవుల్లా పార్థివ దేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళీ, రామలింగారెడ్డి, జేఎల్ మురళీ, గౌస్ మొహిద్దీన్, గాండ్ల విశాలాక్షి, మాజీ మేయర్ స్వరూప, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, సరిపూటి రమణ, కొండవీటి సుధాకర్‌నాయుడు, సింగవరం రవీంద్రనాయుడు, గంగారామ్, వెంకటప్ప, స్వామిదాస్, కుంచెపు వెంకటేష్, గుడిపూటి నారాయణస్వామి, ఉమర్, స్వప్న, సంగా తేజస్విని, సరళ, వడ్డే భవానీ, లక్ష్మీనాయుడమ్మ, బల్లా పల్లవి, కూచి హరి, సైపుద్దీన్, ఇస్మాయిల్, ఫిరోజ్ అహ్మద్, ముక్తియార్, లక్ష్మీనరసింహ, మణికంఠ బాబు, కృష్ణకుమార్, తాడిపత్రి వైసీపీ నాయకుడు ఫయాజ్‌బాషా, వైసీపీ నాయకులు ఆత్మారామిరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, జనసేనా నాయకులు టీజీ ప్రకాష్, లక్ష్మీపతి, బాబురావ్, తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

పార్టీ అండగా ఉంటుంది: టీడీపీ ముఖ్యనేతలు

జకీవుల్లా కుటుంబానికి తెలుగు దేశం పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ ముఖ్యనేతలు స్పష్టం చేశారు. జకీవుల్లా ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఒక మైనార్టీ నేతను కోల్పోవడం బాధాకమన్నారు. కేఎం జకీవుల్లా, ఆయన కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. నేతలందరూ మాజీ ఎంపీ సైపుల్లా, కేఎం జకీవుల్లా, కేఎం రహంతుల్లా కుమారులను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా నింపారు.



కేఎం జకీవుల్లా పార్థివ దేహంపై పార్టీ కండువా కప్పి నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి




గడ్డం సుబ్రహ్మణ్యం, గౌస్‌మొహిద్దీన్, రాయల్ మురళి, కేశవరెడ్డి తదితరులు..




జేసీ ప్రభాకర్‌రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి నివాళి





విశ్వేశ్వరరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, సాకే గంపన్న నివాళులు





నివాళులు అర్పిస్తున్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, కాయగూరల లక్ష్మీపతి, సీపీఐ జాఫర్ తదితరులు, కన్నీటి పర్యంతమవుతున్న మహిళలు

టీచర్లకు వైద్య శిబిరాలు

- 24 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం విద్య, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్లు పొందాలనుకునే టీచర్లకు ఈనెల 24 నుంచి 26 వరకూ ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు సోమవారం డీఈఓ ప్రసాద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టేట్ టీచర్స్ రెగ్యులేషన్ యాక్ట్ -2025 మేరకు విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో పనిచేసే టీచర్లు, హెచ్‌ఎంలు అందరూ సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలన్నారు. అనంతపురం జిల్లా సర్వజన ఆసుపత్రిలో మెడికల్ క్యాంపులు ఉంటాయన్నారు. టీచర్లు తమ పాత సర్టిఫికెట్లు చూపించి సంబంధిత డాక్టర్లతో పరిశీలన చేయించుకుని కొత్త సర్టిఫికెట్లు పొందాలన్నారు. కొత్త సర్టిఫికెట్ల ఆధారంగానే బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ కేటగిరీ పాయింట్లు వర్తిస్తాయన్నారు.

ఎండిపోయిన వెంకటాపురం చెరువు





అతిథుల ఆకలి కేకలు

సైబీరియా వలస పక్షులకు ఆహారం, నీటి కొరత

- భారంగా మారిన పిల్లల పోషణ
- అడుగంటిన చెరువులు, కుంటలు
- ఆహారం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్తున్న పక్షులు
- ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోని అధికారులు

అతిథులకు ఆకలి కష్టాలు మొదలయ్యాయి. మండుతున్న వేసవిలో నీరు, ఆహారం దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. సంతానోత్పత్తి కోసం వేల కిలోమీటర్ల దూరం నుంచి కుగ్రామమైన వీరాపురానికి వచ్చిన సైబీరియన్ పక్షులు ఆహారం కోసం అలమటిస్తున్నాయి. వందల సంవత్సరాలుగా సైబీరియా ప్రాంతం నుంచి వచ్చి వీరాపురం, వెంకటాపురం గ్రామాల్లో విడిది చేయడం ఈ పక్షుల(పెయింటెడ్ స్టార్క్ లేదా ఎర్ర కాళ్ల కొంగలు)కు అలవాటు. ప్రస్తుతం ఈ గ్రామాల పరిసరాల్లో చెరువులు, కుంటలు అడుగంటడంతో వీటికి తిండి తిప్పలు ఎదురవుతున్నాయి. ఆహారం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి రావాల్సి వస్తోంది. తాగే నీళ్లు సైతం అందుబాటులో లేకపోవడంతో కర్ణాటకలోని గుడిబండ, బాగేపల్లి సమీపంలోని పరగోడు, హంసంద్ర డ్యాంలకు పక్షులు రోజూ ప్రయాణించాల్సి వస్తోంది.

చిలమత్తూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వలస పక్షులకు ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది ఆహారపు సమస్య వచ్చిపడింది. దాంతో అవి సంతానాభివృద్ధి కంటే ఆహారం కోసమే వెంపర్లాడాల్సి వస్తోంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటికే వీరాపురం, వెంకటాపురం గ్రామాల పరిధిలో గల చెరువులు, కుంటలు అడుగంటాయి. దాంతో పక్షులకు అవసరమైన ఆహారం దొరకడం కష్టంగా మారింది. చెరువుల్లో నీళ్లు ఉంటే పుష్కలంగా చేపలు, క్రిమికీటకాలు వంటివి వాటికి ఆహారంగా అందేవి. అయితే చెరువులు ఎండిపోవడంతో ఆహారం లేకుండా పోయింది.

కష్టంగా పిల్లల పోషణ

పెయింటెడ్ స్టార్క్ పక్షులు ప్రధానంగా సంతానోత్పత్తి కోసమే ఈ ప్రాంతానికి వస్తాయి. వాటి సంతానాభివృద్ధికి ఈ ప్రాంత వాతావరణం అనుకూలంగా ఉండటంతో వందల సంవత్సరాల నుంచి ఆ పక్షులు వస్తున్నాయి. పిల్లలు ఎగరగలిగే సామర్థ్యం వచ్చేంత వరకు ఇక్కడే ఉంటాయి. ఇది ప్రతి ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు జరుగుతుంటుంది. వాటికి ఆహారం పుష్కలంగా ఉంటే ఎటువంటి ప్రకృతి విపత్తులు వచ్చినా తట్టుకునే శక్తిని కలిగి ఉంటాయి. ఇప్పుడు ఆహారం, నీటి కొరత రావడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకమైంది. పక్షులు బతకడమే కాకుండా వాటి సంతానాన్ని సైతం కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. దీంతో ఆహారం కోసం వందల కిలోమీటర్ల దూరం వెళ్లి ఆహారాన్ని సేకరించి తన పిల్లలకు తీసుకువస్తున్నాయి.

ఆహారం కోసం సుదూర ప్రాంతాలకు..

తమకు, తమ సంతానానికి అవసరమైన ఆహారం కోసం పెయింటెడ్ స్టార్క్ పక్షులు తమ విడిది కేంద్రాలుగా ఉన్న వీరాపురం, వెంకటాపురం గ్రామాల నుంచి సుదూర ప్రాంతాలకు తరలి వెళుతున్నాయి. వేకువజామునే పక్షులు తమ గూళ్ల నుంచి కర్ణాటకలోని హంసంద్రం, పరగోడు, గుడిబండ డ్యాంలకు చేరుకుంటున్నాయి. అక్కడ వేటాడిన అనంతరం తమ నోటితో చేపలను పట్టుకొని గూళ్లకు చేరుకుంటాయి. ఆహారం కోసం ఎదురు చూస్తున్న పిల్లలకు ఆహారాన్ని అందిస్తున్నాయి. ఇలా రోజూ వందల కిలోమీటర్ల దూరం అతిథి పక్షులు ఆహారం కోసం ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో అలసటకు గురవుతూ నీరసించి పోతున్నాయి.

ప్రత్యామ్నాయ చర్యలు శూన్యం

సైబీరియా పక్షులు ఎదుర్కొంటున్న ఆహారం, నీటి కొరత సమస్యను అధిగమించడానికి సంబంధిత అధికారులు తీసుకుంటున్న ప్రత్యామ్నాయ చర్యలు శూన్యం. గతంలో అటవీ శాఖ అధికారులు పక్షుల కోసం వీరాపురం చెరువుల్లో తాత్కాలిక నీటి తొట్టెలను ఏర్పాటుచేసి అందులో చేపలను వదిలేవారు. దాంతో కొంత వరకు వాటికి ఆహారం, నీటి సమస్య తీరేది. అయితే ఈ ఏడాది సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు ఆ దిశగా అడుగులు వేయలేదు. వాటి కోసం ఏర్పాటుచేసిన నీటి తొట్టెలు పూర్తిగా శిథిలమయ్యాయి. వాటిని బాగు చేసి పక్షులకు సౌకర్యం కల్పించాల్సి ఉంది. కానీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.





శిథిలావస్థలో నీటి తొట్టి

వీరాపురం వద్ద చెట్లుపై సైబీరియా వలస పక్షులు



పిల్లలకు రక్షణ ఏర్పాట్లు శూన్యం

పక్షి చెట్లపై ఆవాసాలు ఏర్పరచుకున్న పక్షులు గాలి వానలకు తమ పిల్లలను కోల్పోతున్నాయి. చెట్లపై నుంచి కింద పడి కొన్ని గాయపడుతున్నాయి. మరికొన్ని మృతి చెందుతున్నాయి. ఇటీవల వాతావరణంలో వస్తున్న మార్పులతో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో పక్షులు తమ గూళ్ల నుంచి కింద పడి మృతి చెందే అవకాశం ఉంది. గాయపడిన పక్షి పిల్లలకు వైద్యం, ఆహారం అందివ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రతిపాదనలు పంపాం

వీరాపురంలో సైబీరియా వలస పక్షుల రక్షణకై అవసరమైన పనులు చేపట్టడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. తాగునీరు, ఆహారం వంటి వాటిని సమకూర్చాలని ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. పక్షులకు అవసరమైన చేపలు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. నీటి తొట్టెలు ఏర్పాటు చేసి వాటికి తాగునీటి సమస్య రాకుండా, సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు చేపడతాం.

-శ్రీనివాసరెడ్డి, పెనుకొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపాలి



ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపితే చెరువులకు నీళ్లు తీసుకురావచ్చు. గతంలో పంపింగ్ ద్వారా వీరాపురం, వెంకటాపురం చెరువులకు నీరందిస్తామని చెప్పారు. చెరువుల్లో నీళ్లు ఉంటే పక్షులకు సమృద్ధిగా ఆహారం లభిస్తుంది. గ్రామంలో పక్షుల మనుగడ కోసం స్వచ్ఛందంగా చెరువుల సీజ్‌కి గతంలో ఒప్పందం చేసుకొని వర్షపునీటిని నిల్వ ఉంచుకున్నాం. పక్షుల రాకతోనే వీరాపురం పర్యాటక కేంద్రంగా మారింది. దాన్ని మరింత అభివృద్ధి చేయాలి. అటవీ శాఖ అధికారులు పక్షుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

-శివారెడ్డి, వీరాపురం

రక్షణ ఏర్పాట్లు చేపట్టాలి



చెట్లపై ఆవాసాలు ఏర్పర్చుకున్న పక్షులు గాలి వానలకు తమ పిల్లలను కోల్పోతున్నాయి. గాయపడిన పిల్లలకు నేను సొంతంగా ఏర్పాటు చేసిన షెల్టర్‌లో ఉంచి చికిత్స, ఆహారం అందిస్తున్నా. గత ఐదేళ్లుగా వాటి రక్షణ కష్టమైంది. దీనిని దృష్టిలో పెట్టుకొని గాయపడిన పక్షి పిల్లలకు వైద్యం, ఆహారం అందివ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. -వేణు, పక్షుల సంరక్షణ సేవకుడు. వీరాపురం

క్రైం కార్నర్ ● ప్రాణంతీసిన అతివేగం

● రెండు బైక్‌లను ఢీకొన్న కారు
● ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు


సాయితేజ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అతివేగం ప్రాణం తీసింది. కారు అతివేగంతో ఎదురుగా వస్తున్న రెండు బైక్‌లను ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని ప్యాదిండి గ్రామ సమీపాన సోమవారం ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రామగిరి మండలం శ్రీహరిపురానికి చెందిన భారతి, నరసింహులు దంపతుల పెద్ద కుమారుడు సాయితేజ (24) ధర్మవరంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో పనిచేస్తుండేవాడు. స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో విధుల నిమిత్తం ధర్మవరానికి బయల్దేరాడు. ప్యాదిండి వద్దకు వెళ్లగానే ధర్మవరం నుంచి ఎన్ఎస్ గేటు వైపు వెళ్తున్న తమిళనాడుకు చెందిన కారు అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. అలాగే ముందు కెళ్లి మరో ప్యాదిండికి చెందిన రమేశ్ ద్విచక్రవాహనాన్ని సైతం ఢీకొంది. ప్రమాదంలో సాయితేజ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన రమేశ్‌ను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరగగానే కారును వదిలేసి, అందులోని వ్యక్తి పరారయ్యాడు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. కాగా, సాయితేజకు వివాహం కాలేదు.

రైలు కిందపడి యువకుడి మృతి

అనంతపురం న్యూటౌన్ ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం సమీపంలోని స్థానిక రాజీవ్‌కాలనీ నేషనల్ హైవే బ్రిడ్జి సమీపంలో సోమవారం తెల్లవారుజామున సాగర్ (32) రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఈయన వలస వచ్చి రాజీవ్ కాలనీ సమీపంలో చిన్న గుడిసె వేసుకొని ఉండేవారని స్థానికులు తెలిపారన్నారు. ఐదేళ్ల కిందట భార్య కూడ మృతి చెందిందన్నారు. తొలుత గుర్తుతెలియని శవంగా నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సుమారు 11 గంటల సమయంలో కొందరు రైల్వే పోలీసు కార్యాలయానికి వచ్చి ఆధారాలు చూపడంతో మృతుడి వివరాలు తెలిశాయన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో యూపీ కార్మికుడు..

హిందూపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గోళ్లాపురం పారిశ్రామిక వాడలోని హిందూపురం స్టీల్ పరిశ్రమలో సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన కున్వార్ బహదూర్ సింగ్ (47) మృతి చెందినట్లు అప్‌గ్రేడ్ ఏఎస్ఐ సురేష్ తెలిపారు. ఆదివారం రాత్రి పరిశ్రమవద్ద స్నానం చేయడానికి వెళ్లాడు. ఈ సందర్భంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే కర్ణాటకలోని గౌరీబిదనూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి...


శివారెడ్డి (ఫైల్)

బత్తలపల్లి ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రాయపల్లి సమీపంలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. మండలంలోని యర్రాయపల్లి సమీపంలోని కొండలో చెట్టుకు వేలాడుతూ కుళ్లిన మృతదేహాన్ని సోమవారం గ్రామస్థులు గుర్తించారు. వారు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహం వద్ద లభించిన ఆధారాల మేరకు శివారెడ్డి(43)గా గుర్తించారు. తాడిమర్రి మండలం పులంపల్లికి చెందిన శివారెడ్డి ధర్మవరంలోని ఎరువుల దుకాణంలో పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈనెల 1 నుంచి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ధర్మవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య లత, కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు విచారణలో తేలాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగా లేని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని అరవిందనగర్‌లో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. రోహిణీ కుమార్‌రెడ్డి(60), లక్ష్మీస్వరూప దంపతులు అరవిందనగర్‌లో నివాసం ఉంటున్నారు. రోహణీకుమార్‌రెడ్డికి గత కొన్నేళ్లుగా మానసిక స్థితి సరిగా లేదు. లక్ష్మీస్వరూప జనరల్ స్టోర్ నిర్వహిస్తోంది. కొడుకులు వెంకటరమణారెడ్డి బెంగుళూరులో, లోక్‌నాథ్‌రెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ఆదివారం రోహిణీ కుమార్‌రెడ్డి తన భార్యతో గొడవపడ్డాడు. ఆ సమయంలో కత్తితో దాడి చేయడంతో భార్య కడుపుపై గాటుపడింది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి రెండో కొడుకు వచ్చాడు. తల్లిని చూడటానికి ఆసుపత్రికెళ్లాడు. తండ్రి కుమార్‌రెడ్డి ఆ సమయంలో ఇంట్లోనే ఉన్నాడు. ఆసుపత్రికి వెళ్లి మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చాడు. తలుపులు వేసుకుని తీయలేదు. కొన్నిసార్లు అలా తలుపేసుకుని పడుకునేవాడు. దీంతో వెనుదిరిగి మళ్లీ అరగంట ఆగి వచ్చి తలుపు కొట్టినా తలుపు తీయకపోవడంతో కొడుకు లోక్‌నాథ్‌రెడ్డికి అనుమానం వచ్చింది. తలుపులు పగలకొట్టి చూస్తే...ఇల్లంతా చిందరవందరగా పడి ఉండటంతో పాటు ఉరికి వేలాడుతున్న తండ్రి కనిపించాడు. కిందకు దింపి చూస్తే అప్పటికే మృతి చెందాడు. ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పుట్లూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాండ్లపాడు గ్రామ శివారులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు సోమవారం ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. సుమారు 50 ఏళ్ల పైబడి ఉన్న వ్యక్తి నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు తెలుస్తోంది. తెల్లని పంచ, చొక్కా ధరించాడని తెలిపారు. మృతిపై గ్రామస్తులను విచారించారు. సీఐ సత్యబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు గొర్రెల పెంపకందారుల మహాసభ

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ మహాసభ సమావేశాన్ని ఈనెల 23న పశుసంవర్థక శాఖ జిల్లా కార్యాలయం ఆవరణంలో నిర్వహిస్తున్నట్లు యూనియన్ పర్సన్ ఇన్‌చార్జి రమేష్‌రెడ్డి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ శ్రీలక్ష్మీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి సహకార యూనియన్ అధ్యక్షులు, పర్సన్ ఇన్‌చార్జిలు, డైరెక్టర్లు తప్పని సరిగా హాజరుకావాలని కోరారు.

నేలరాలిన ఆశలు..!

● గాలివానకు పడిపోయిన పంటలు
● దెబ్బతిన్న అరటి, కర్బూజ, వరి, మామిడి, బొప్పాయి
● అన్నదాతకు రూ.1.57 కోట్ల నష్టం
● నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం గాలివాన బీభత్సానికి తోట పంటలు భారీగా దెబ్బతిన్నాయి. అన్నదాతలకు తీవ్ర నష్టం జరిగింది. మామిడి, వరి, కర్బూజ, అరటి, బొప్పాయి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.
(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

రాలిన మామిడి

చెన్నేకొత్తపల్లి మండలంలో ఆదివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పండ్లతోటలకు తీవ్రనష్టం జరిగింది. నాగసముద్రం, పులేటిపల్లి న్యామద్దల, వెంకటంపల్లి, కోటంపల్లి గ్రామాలలో నష్ట తీవ్రత ఎక్కువగా ఉంది. నాగసముద్రం రైతు ఆంజినేయులు నాలుగున్నర ఎకరాలలో సాగు చేసిన అరటి కోత సమయంలో ధ్వంసమైంది. అదే గ్రామానికి చెందిన అంజనేయులు, జయరాం, నాగభూషణం సాగు చేసిన అరటిపంట ధ్వంసమైంది. పులేటిపల్లిలో రైతు కిష్టమ్మ 4 ఎకరాలలో, మాధవరెడ్డి 4 ఎకరాలు, పైలబోయలపల్లిలో వెంకటేశ్వరరెడ్డి 4 ఎకరాలలో సాగు చేసిన అరటి పంట ధ్వంసమైంది.

కర్బూజకు భారీ నష్టం

చెన్నేకొత్తపల్లి మండలంలో పులేటిపల్లిలో లక్ష్మన్న 4 ఎకరాలలో సాగు చేసిన కర్బూజ కోత సమయంలో తుడిచిపెట్టుకుపోయింది. వెంకటంపల్లిలో హనుమంతరెడ్డి 2 ఎకరాలు, రామ్మోహన్‌రెడ్డి 2 ఎకరాలలో సాగు చేసిన కర్బూజ పంట దెబ్బతింది. వెంకటంపల్లిలో ముత్యాలప్ప మామిడి తోట టన్నుకుపైగా మామిడికాయలు నేలరాలాయి. ఇదే గ్రామంలో నాగిరెడ్డి తోటలో 3 టన్నులు, గోవిందరెడ్డి తోటలో ఒకటిన్నర టన్ను మామిడి కాయలు నేలరాలాయి. కోటంపల్లిలో లక్ష్మీదేవి తోటలో మామిడికాయలు నేలరాలాయి. పులేటిపల్లిలో వెంకటేశ్ ఎకరం విస్తీర్ణంలో సాగు చేసిన వరిపంట నేలకొరిగింది. ఇదే గ్రామంలో నారాయణరెడ్డికి చెందిన 2 ఎకరాల మొక్కజొన్న పంట దెబ్బతింది. హార్టికల్చర్ అధికారులు, సిబ్బంది దెబ్బతిన్న పంటలను సోమవారం పరిశీలించారు. మండలవ్యాప్తంగా చెట్ల కొమ్మలు ట్రాన్స్‌ఫార్మర్‌ల మీద పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.


పెద్దవడుగూరు మండలం అప్పేచర్ల వద్ద నేలకొరిగిన బొప్పాయి పంటను చూపుతున్న రైతు


రామగిరి మండలం శేషంపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు

అంతటా నష్టమే..

● శెట్టూరు మండలం అయ్యగార్లపల్లి, బసంపల్లి తోటలలో మామిడి కాయలు నేలరాలాయి. బొప్పాయి తోటలు ధ్వంసమయ్యాయి. బసంపల్లి రైతు మల్లయ్య ఐదు ఎకరాలలో సాగు చేసిన మామిడి పంట దెబ్బతింది. ఉద్యాన శాఖ అధికారి గౌసియాబీ పంట నష్టాన్ని పరిశీలించారు. మండలంలో అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గ్రామాలలో అంధకారం అలుముకుంది.

● పెద్దవడుగూరు మండలం అప్పేచర్లలో రైతు విరూపాక్షిరెడ్డి నాలుగు ఎకరాలలో సాగు చేసిన బొప్పాయి నేల కూలింది. రూ.4లక్షలు నష్టం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

● అమరాపురం మండలం మద్దనకుంటలో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి రైతు దేవరాజ్ తోటలో మామిడి కాయలు రాలిపోయాయి. రూ.లక్ష దాకా నష్టపోయాడు.

● సోమందేపల్లి మండలం సుద్దకుంటపల్లిలో రైతు ప్రసాద్ 30 ఎకరాల్లో సాగు చేసిన మామిడి తోటలో పిందెలు నేలరాలాయి. మండల వ్యాప్తంగా మామిడి రైతులు నష్టపోయారు.


చెన్నేకొత్తపల్లి మండలం పులేటిపల్లి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలిన చెట్టు


శెట్టూరు మండలం బసంపల్లి వద్ద నేలరాలిన మామిడి పండ్లు

భారీ వర్షం

రామగిరి మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. 51.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. కుంటలు, వాగులకు నీరు చేరింది. శేషంపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణ, సమీపంలో ఇళ్ల వద్ద భారీగా నీరు నిలిచింది. ప్రహరీ లేకపోవడం, పాఠశాల ఆవరణ లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం కురిసిన ప్రతిసారీ సమస్య తలెత్తుందోంది. అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పిడుగుపాటుకు ఇల్లు ధ్వంసం

తనకల్లు మండలం పూలకుంటపల్లిలో ఆదివారం రాత్రి పిడుగుపాటుకు పెంకుటిల్లు ధ్వంసమైంది. నరేంద్రకు చెందిన ఆ ఇంట్లో ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణం నష్టం జరగలేదు. ఇంట్లో టీవీ, ఫ్రిజ్, ఇతర వస్తువులు ధ్వంసమయ్యాయి.

21 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 21 మండలాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా ఆత్మకూరులో 72.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. గుంతకల్లు 68.2, వజ్రకరూరు 46.2, శెట్టూరు 34.4, కుందుర్పి 29.6, కళ్యాణదుర్గం 29.4, కంబదూరు 18.6, బ్రహ్మసముద్రం 17.0, బెలుగుప్ప 15.2, గుత్తి 14.4, రాయదుర్గం, గుమ్మఘట్ట 10.2, రాప్తాడు 6.0, విడపనకల్లు 5.2, కణేకల్లు 3.6, పామిడి, ఉరవకొండ 3.2, డి. హిరేహాళ్ 2.4, పెద్దవడుగూరు 2.2, యాడికి 2.0, బొమ్మనహాళ్ 1.2 మి.మీ. వర్షపాతం కురిసింది. జిల్లావ్యాప్తంగా 122.4 హెక్టార్లలో రూ.1.57 కోట్ల విలువైన పంట నష్టం వాటిల్లింది. ఇందులో 29 మంది రైతులకు సంబంధించి 31.40 హెక్టార్లలో రూ.80.30 లక్షల విలువైన అరటి, నిమ్మ, మామిడి, బొప్పాయి, కర్బూజ, కళింగర, దానిమ్మ, చీనీ తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 56 మంది రైతులకు సంబంధించి 91 హెక్టార్లలో రూ.77.35 లక్షల విలువైన మొక్కజొన్న పంట దెబ్బతింది.

ప్రతి అర్జీనీ పరిష్కరించాలి: కలెక్టర్

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లా నలుమూలల నుంచి అనేక వ్యయప్రయాసలతో వచ్చి ఇచ్చిన ప్రజల అర్జీలను సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ పాల్గొని 304 అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన అర్జీలను అధికారులు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలను పాఠశాలలో చేర్పించడానికి మండల ప్రత్యేక అధికారులు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారధి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీవో సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎంహెచ్ఓ ఫిరోజ్ బేగం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జునయ్య, నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, గిరిజన సంక్షేమశాఖాధికారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తిలో మహాత్మ జ్యోతిరావు పూలే కమ్యూనిటీ భవన నిర్మాణానికి రెండు ఎకరాల స్థలం కేటాయించాలని బీసీ నాయకులు సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. అడవులను అగ్నిబారి నుంచి కాపాడాలని సాహితీగగన్ మహల్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 604 యూనిట్లు మంజూరు

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని లబ్ధిదారులకు 604 యూనిట్లు మంజూరైనట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరు, కరువు మండలాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.25.14 కోట్లు మంజూరు చేస్తామన్నారు. కరువు మండలాల్లో రైతుల రుణాలు రీషెడ్యూల్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, అధికారులు పాల్గొన్నారు.

న్యాయాధికారిని కలిసిన కలెక్టర్

అనంతపురం జిల్లా న్యాయాధికారి భీమారావును శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సోమవారం అనంతపురంలోని కో ర్టులో మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన జిల్లా న్యాయాధికారిగా బాధ్యతలు చేపట్టిన భీమ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు లాస్ట్ చాన్స్

● ఇంటర్ సప్లీ ఫీజు చెల్లింపునకు ఆఖరి గడువు

అనంతపురం విద్య, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపునకు మంగళవారం ఆఖరి గడువని డీవీఈఓ, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 12 నుంచి 22 వరకూ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తా మన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు, ఇంప్రూమెంట్ రాసే విద్యార్థులు సంబంధిత కళాశాలల్లో వెంటనే ఫీజు చెల్లించాలన్నారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ఫీజు బకాయి ఉందని, పరీక్షల ఫీజు కట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చీనీ టన్ను రూ.23వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23,800 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 4వేలు, సరాసరి రూ. 15వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 732 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

హంద్రీనీవాను వెడల్పు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

గుంతకల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా హంద్రీనీవాను పదివేల క్యూసెక్కుల నీరు పారే విధంగా వెడల్పు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని జి. కొట్టాల గ్రామం వద్ద హంద్రీనీవాలో జరుగుతున్న వెడల్పు పనులను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. సీఎం ప్రకటన మేరకు హంద్రీనీవాను పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని, అంతవరకూ లైనింగ్ పనులను చేయరాదని డిమాండ్ చేశారు. రాగులపాడు వద్ద నుంచి వజ్రకరూరు, గుంతకల్లు, పామిడి మండలాల చెరువులకు నీరిచ్చే కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పండ్ల తోటల రైతులకు ప్రభుత్వం పరిహారాలను ఇవ్వాన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి. శ్రీనివాసులు, నాయకులు మారుతీ ప్రసాద్, కసాపురం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను పరిశీలిస్తున్న రాంభూపాల్

నీటి కేటాయింపులతోనే సీమ అభివృద్ధి

● సదస్సులో వక్తలు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సాగుకు అవసరమైన నీటి కేటాయింపులతోనే రాయలసీమ అభివృద్ధి సాధ్యమని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఎస్ఐఎస్ఏ) ఆధ్వర్యంలో సోమవారం ఓ సదస్సును నిర్వహించారు. 'రాయలసీమ కరువు, నీటి సవాళ్లు, పరిష్కారాల సాధ్య, సాధ్యాలు' అంశంపై ఎన్జీయాలో ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. వక్తలుగా జల సాధన సమితి నాయ కులు, న్యాయవాది రామకుమార్, ప్రొఫెసర్ జీవీ రమణ, సాకేహరి, నాగార్జునరెడ్డి, అశోక్ వర్ధన్, రామాంజినేయులు, రాహుల్ హాజరై మాట్లాడారు. మూడు దశాబ్దాల కిందటి వరకు వాగులు, వంకల ద్వారా పారే వర్షపు నీరు, చెరువులు, కుంటల్లోని నిల్వ నీటి ద్వారా వరి, రాగి వంటి పంటలు పండించేవారన్నారు. వర్షాకాలంలో వేరుశనగ, పప్పుశనగ, కందులు, పెసలు, అలసంద, నువ్వులు వంటివి సాగు చేస్తూ వచ్చారన్నారు. ఈ క్రమంలో సాగు విస్తీర్ణం పెరిగి కొంతమేరకు ఆహార కొరత తీరిందని వివరించారు. అనంతరం వర్షాభావం నేపథ్యంలో బోరు బావులను తవ్వుకుని కొన్ని సంవత్సరాలు రైతులు జీవనం సాగించారన్నారు. అయితే కరువు తీవ్రమవడంతో బోరు బావుల్లోనూ నీరు ఇంకిపోయిందన్నారు. దీంతో అనేకమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్చెల్సీ, హెచ్ఎన్ఎస్ వంటి నీటి కాలువలు అరకొరగానే వ్యవసాయానికి ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ఐదు సంవత్సరాలకు ఒక సారి ప్రభుత్వాలు మారుతున్నా శాశ్వత పరిష్కారాలు మాత్రం చూపడంలేదని వాపోయారు. రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించడంలేదన్నారు. నీటి వనరుల లభ్యతను గుర్తించడం, వరద నీటిని నిల్వ చేయడం, ఎత్తిపోతల ద్వారా రాయలసీమకు నీటిని తరలించడం, ప్రస్తుతమున్న కాలువలను విస్తరింపచేయడం, అధిక టీఎంసీల నీటిని కేటాయించడం పరిష్కార మార్గాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వెంకటేష్, లక్ష్మి, విశ్వనాథ్, హరిత, చంద్రన్న, విజయ్ పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న వక్తలు

దశాబ్దాలుగా సమస్యలు తిష్ట

న్యూస్ బాక్స్



కదిరి : కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

విద్యతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే

కదిరిఅర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): విద్యతోనే జీవితంలో అభివృద్ధి, ఉన్నత శిఖరాలకు చేరుకోవడం సాధ్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అభిప్రాయపడ్డారు. మండలంలోని ఎరుకలవాండ్లపల్లి వద్ద ఉన్న హరీష్ పాఠశాల 53వ వార్షికోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే, ఆర్డీఓ వీవీఎస్ శర్మ, ఆర్డీఓ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారధి హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెండ్ ఎంఎస్ కిరణ్, ప్రిన్సిపల్ ప్రశాంత్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ, డాక్టర్ రమణయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● ధ్వంజస్తంభం ప్రతిష్ఠలో..

కదిరి : తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లి సోమవారం రాత్రి నాగలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ధ్వంజస్తంభం ప్రతిష్ఠలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థుల కోరిక మేరకు నాగలింగేశ్వరస్వామి దేవస్థానానికి కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తామని హామీఇచ్చారు.

గాయపడిన వ్యక్తికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తనకల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటిచింతమానుతండాకు చెందిన తులసేనాయక్ ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతనికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రూ. 50 ఆర్థిక సాయం అందజేశారు. తులసేనాయక్ చంద్రబాబునాయుడి వీరాభిమాని. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా ఆదివారం కేక్ తీసుకురావడానికి కొక్కంటి క్రాస్‌కు ద్విచక్రవాహనంలో వెళ్లారు. అక్కడ మరో బైక్ ఢీకొనడంతో అతని కాలు విరిగింది. అతన్ని కదిరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆపరేషన్ అవసరమని డాక్టర్లు చెప్పారు. ఈ విషయం తెలుసుకుని కదిరి ఎమ్మెల్యే సోమవారం ఆ ఆసుపత్రికి వెళ్లి బాధితున్ని పరామర్శించి, ఆర్థికసాయాన్ని అందచేశారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు ఉత్తన్ననాయక్, చంద్రశేఖర్‌నాయక్, రమణనాయక్ ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తచెరువు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు స్థానిక డీఈఓ కార్యాలయంలో డీఈఓ కిష్టప్పకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్ మాట్లాడుతూ... 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు నియామకపత్రాల్లో ఒక కామన్ జాయినింగ్ తేదీ ఇవ్వాలని కోరారు. అదేవిధంగా 2009లో ఉదోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు కూడా జాయినింగ్ డేట్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇటీవల 10వ తరగతి పరీక్షల్లో సస్పెండ్ అయిన ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి రవిచంద్ర, వెంగమనాయుడు, శివయ్య, శ్రీనివాసులు, శంకరనాయుడు, షెక్షావలి, సురేశ్, కిష్టప్ప, అనిల్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా నిలిపివేత

ధర్మవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్టు కమిషనర్ ప్రమోద్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కదిరిగేటు వద్ద జోన్-1 పంపింగ్ లైన్ మరమ్మత్తులు కారణంగా నీటిసరఫరా నిలిపివేస్తున్నామని, తిరిగి పైపులైన్ మరమ్మత్తు పనులు పూర్తయిన వెంటనే నీటిని సరఫరా చేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఉష, నవ్య, శ్రీనివాసులు

ధర్మవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ధర్మవరం ఆర్డీటీ క్రీడామైదానంలో కబడ్డీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ఉష, నవ్య శ్రీనివాసులు రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం గుంతకల్లులో రైల్వే క్రీడామైదానంలో జరిగిన 12వ జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటిన వీరు.. మే 2 నుంచి 5వరకు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారు. వీరిని కబడ్డీ కోచ్ పృథ్వీ, ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ విద్యార్థులు



పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు లేఖన, ఓంశ్రీ, ఫర్హానా కదిరిలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపల్ రమేష్‌బాబు ఫిజికల్ డైరక్టర్ అజీంఫాషా, సిబ్బంది సోమవారం అభినందించారు.

580 దానిమ్మ మొక్కల ధ్వంసం

బత్తలపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురానికి చెందిన బీజేపీ నాయకుడు సురేంద్రకు చెందిన రెండు ఎకరాల్లోని 580 దానిమ్మ మొక్కలను ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం తోటకు వెళ్లిన సురేంద్ర.. విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆరు నెలల క్రితం ఈ మొక్కలు నాటినట్లు ఆయన తెలిపారు. విషయం తెలుసుకున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు ఆ తోటను పరిశీలించారు. కారకులను కఠినంగా శిక్షించాలని పోలీసులను ఫోన్ ద్వారా కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.



మొక్కలను పరిశీలిస్తున్న హరీష్‌బాబు



ఇళ్ల ముందు నిల్వ ఉన్న మురుగు



సీసీ రోడ్డుకు నోచుకోని నాగార్జున వీధి

- ప్రభుత్వాలు మారుతున్నా.. తీరని వ్యథలు
- కాలువలు లేక వీధుల్లో మురుగు
- దోమల దాడితో రోగాల పాలు
- ఓడీసీ బీసీ కాలనీ దుస్థితి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు.. దశాబ్దాలు మారినా స్థానిక బీసీ కాలనీలో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇక అభివృద్ధి కనుచూపు మేరలో కనిపించదు. ఈ కాలనీలో దాదాపు 250 కుటుంబాలు ఉంటున్నాయి. ప్రధానంగా ఈ కాలనీ వాసులు మురుగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు లేకపోవడంతో మురుగునీరు వీధుల్లోనే నిల్వ ఉంటోంది. దీంతో దోమలు అధికమై ఆ ప్రాంత వాసులు రోగాల బారిన పడుతున్నారు. వీటికి తోడు కొన్ని వీధుల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో.. ఎగుడు దిగుడు రోడ్లలోనే ప్రజలు నడవాల్సి వస్తోంది. రాత్రి సమయంలో వృద్ధులు, పిల్లలు పడి గాయపడ్డ సందర్భాలు అనేకం. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పాలకులకు, అధికారులకు ఈ కాలనీ వాసులు ఈ సమస్యలను వారి దృష్టికి తీసుకొని వెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీంతో గత్యంతరం లేక మురుగు, దుర్వాసనతో పాటు దోమకాటుతో ఆ కాలనీ వాసులు కాలం వెళ్లదీస్తున్నారు. ఈ టీడీపీ పాలకులైనా ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

కాలువలు ఏర్పాటు చేయాలి



కాలనీలో సుమారు 250 కుటుంబాలు ఉంటున్నాయి. ప్రధానంగా మురుగునీటి కాలువలు లేవు. దీంతో అందరూ వీధుల్లోనే మురుగునీరు వదిలేస్తున్నారు. దీంతో పలుమార్లు వృద్ధులు, చిన్నారులు, ద్విచక్ర వాహనదారులు జారిపడి గాయపడ్డారు. అధికారులు, పాలకులు స్పందించి కాలనీలో మురుగు కాలువ ఏర్పాటు చేయాలి.

- నాగార్జున, బీసీ కాలనీ ఓడీచెరువు

దోమలను భరించలేకున్నాం



మురుగునీటి కాలువలు లేకపోవడంతో వీధుల్లోనే నీరు నిల్వ ఉంటోంది. దీంతో దుర్వాసనతో పాటు దోమలూ అధికమయ్యాయి. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఉక్కపోత సమయంలో కూడా ఆరుబయట ఉండలేకపోతున్నాం. దోమలు కట్టడంతో రోగాల బారిన పడుతున్నాం. సీసీ రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

- వాటర్‌మన్ బాషా, బీసీ కాలనీ, ఓడీచెరువు



చెక్కును అందజేస్తున్న క్లస్టర్ ఇన్‌చార్జి మహేష్‌చౌదరి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలూరు గ్రామానికి చెందిన అనంతమ్మ ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యచికిత్సల కోసం అప్పులు చేసింది. ఆమెకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.87,938 మంజూరయ్యేలా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ కృషిచేశారు. అందుకు సంబంధించిన చెక్కును స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మహేష్‌చౌదరి, మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి విజయసారధి చౌదరి, ఏలుకుంట్ల ఏగినాటి రమణ పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో చిన్నారులు

ముదిగుబ్బ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీఎస్ పాఠశాలలో యూకేజీ విద్యార్థులతో సోమవారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులు టోపీలు, గ్రాడ్యుయేషన్ గౌనులను ధరించి చూపరులను అలరించారు. ఇందులో పాఠశాల ఛైర్మెన్ పీవీ నాయుడు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంట రుణాలు రెన్యువల్ చేసుకోండి

నంబులపూలకుంట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రైతులు పంటలపై తీసుకున్న రుణాలను సోమవారం నుంచి రెన్యువల్ చేస్తున్నట్లు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పిచ్చయ్య తెలిపారు. మండల వ్యాప్తంగా 3,500 మంది రైతులు తమ బ్యాంక్‌లో పంట రుణాలను తీసుకున్నారని, వడ్డీ చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలని అన్నారు. సోమవారం కమ్మగుట్టపల్లి గ్రామ రైతులు రెన్యువల్ చేసుకున్నారని, మంగళవారం గౌనపేట, బుధవారం దిన్నెమీదపల్లి రైతులు రెన్యువల్ చేసుకోవాలని అన్నారు. ఈ అవకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శాంతి ర్యాలీ



శాంతిర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ధర్మవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పట్టణంలో సోమవారం ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు. దీనికి సీపీఐ, సీపీఎం, వైసీపీ నాయకులు, క్రైస్తవులు మద్దతు పలికారు. ఈ ర్యాలీ జామీయా మసీదు నుంచి కళాజ్యోతి, ఎన్టీఆర్, గాంధీనగర్ సర్కిల్ మీదుగా తిరిగి కాలేజ్ సర్కిల్‌కు చేరింది. పలువురు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మైనార్టీల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తోందన్నారు. ముస్లింలకు ఒక్క ఎంపీ సీటు కేటాయించని బీజేపీ ప్రభుత్వం.. వారి ఆస్తులను కాపాడుతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. క్రైస్తవులు, ముస్లింల విలువైన భూములను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడానికి బీజేపీ పన్నాగం పన్నుతోందన్నారు. అనంతరం ఆర్డీఓ మహేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, సీపీఐ నియోజకవర్గకార్యదర్శి మధు, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్‌బాషా, వైసీపీ నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

ముదిగుబ్బ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ కార్డులను సోమవారం టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ మాట్లాడుతూ ... మండలంలో పదివేల మందికి పైగా సభ్యత్వం తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లె నారాయణస్వామి, చంద్రసేన, బాలరాజు, డిస్ రామాంజి, వెంకటనారాయణ, కరుణాకర్, రంగనాయకులు పాల్గొన్నారు.



కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఉపాధి పనులు కల్పించి ఆదుకోండి

పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతి

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అధికారులు పలు ఫిర్యాదులు స్వీరించారు. నల్లమాడ మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలని పలువురు కూలీలు కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతన్‌కు వినతి పత్రం అందించారు. గ్రామానికి చెందిన కొంతమంది తప్పుడు ఫిర్యాదు వల్ల అధికారులు ఉపాధి పనులు ఆపేశారని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

● ఆలయ భూములను రక్షించండి

బుక్కపట్నం మండలంలోని మరాల గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయ భూములను కాపాడాలని ఆ గ్రామానికి చెం దిన తిప్పయ్య, దుర్గమప్ప, పుల్లారెడ్డి, రామచంద్ర కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలో 15ఎకరాలకు పైగా వీరభద్రస్వామి ఆలయ భూములున్నాయని, వీటిని ఆక్రమించుకోవడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. దేవదాయ శాఖాదికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

● ఇంటి స్థలాలు కాపాడండి

ధర్మవరంరూరల్ : మండలంలోని వసంతపురంలో సర్వే నెంబర్ 423, 424లోని 43.60 ఎకరాల్లో గతంలో లేవుట్ వేసి ఇళ్లస్థలాలు ఇచ్చారు. ఆ స్థలాలకు చుట్టూ ఉన్న పొలాల రైతులు దౌర్జన్యంగా ఆ స్థలాన్ని ఆక్రమిస్తున్నారు. మా ఇళ్ల స్థలాలు కబ్జా కాకుండా.. మిగిలిన స్థలాలను పేదలకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని బాధితులు, ఆ గ్రామస్థులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

● ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

గాండ్లపెంట : మండలంలోని రెక్కమాను గ్రామస్థులు తాగునీటి బోరుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలని తహసీల్దార్ బాబురావుకు వినతిపత్రం అందచేశారు. రెండు సంవత్సరాల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, దీంతో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని అంజనమ్మ,ఉమాదేవి, లక్ష్మీదేవి, గంగులమ్మ వాపోయారు.

● రస్తా సమస్య

ముదిగుబ్బ : స్థానిక కస్తూర్బా కాలనీ వెనుక వైపు ఉన్న దాదాపు 200 ఎకరాలకు ఉన్న రస్తా సమస్యను పరిష్కరించాలని ఆ భూముల రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నారాయణస్వామికి వినతి పత్రం అందజేశారు. గతంలో ఉన్న రస్తా కబ్జాకు గురి కావడంతో ఈ సమస్య వచ్చిందని వాపోయారు.

● ఇళ్లస్థలాలు ఇవ్వాలి

కదిరిఅర్బన్ : పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వర్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాల కోసం ఈనెల 26న అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు, రిలే దీక్షలు చేపట్టాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీఎల్ నరసింహులు, సాంబశివ, రామమోహన్, ముస్తాక్, నారాయణ పాల్గొన్నారు.

● పనులు కల్పించండి

ఓబుళదేవరచెరువు : తమ గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలని, సకాలంలో బిల్లులు చెల్లించాలని మల్లెవాండ్లపల్లి గ్రామస్థులు ఎంపీడీఓ రాబర్టు విల్సన్‌కు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు శ్రీరాములు, రామిరెడ్డి రమణ, శివయ్య, వెంకటలక్ష్మీ, లక్ష్మీనరసమ్మ, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.



గాండ్లపెంట: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రెక్కమాను గ్రామస్థులు

వడ్డీతో రుణాలు రెన్యువల్ చేయాలి

ఎస్‌బీఐ ఎదుట రైతుల ధర్నా



వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తనకల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వడ్డీ కట్టించుకొని వ్యవసాయ రుణాలు రెన్యువల్ చేయాలని రైతులు స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఏపీ రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. గతంలో బ్యాంక్ అధికారులు వడ్డీలు కట్టించుకుని రుణాలు రెన్యువల్ చేశారని, ప్రస్తుతం అసలు, వడ్డీ కట్టించుకుని రుణాలు రెన్యువల్ చేశారని ప్రస్తుతం అసలు, వడ్డీ క చెల్లిస్తేనే రెన్యువల్ చేస్తామని చెప్పడం అన్యాయమని అన్నారు. ఈ మేరకు వినతి పత్రాన్ని బ్యాంక్ మేనేజర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శివన్న, వీవీ రమణ, ఎస్‌వీ రమణ, చలపతి, శ్రీనివాసులు, నాగేంద్ర, సీఐటీయు ఒట్టిందు వేమన్న, సీపీఐ మండలకార్యదర్శి రెడ్డెప్ప, రైతులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు 182 మంది గైర్హాజరు

కొత్తచెరువు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పది మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి సోమవారం జరిగిన పరీక్షలకు 1145 మంది విద్యార్థులకు గాను.. 963 మంది హాజరయ్యారని, 182 మంది గైర్హాజరయ్యారని డీఈఓ కిష్టప్ప తెలిపారు. అదే విధంగా ఏపీఆర్‌జేసీ ఇంటర్, డిగ్రీ ప్రవేశానికి ఈనెల 25న ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

● ధర్మవరం : పట్టణంలోని గుట్టకిందపల్లిలోని మోడల్‌స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష సజావుగా జరిగినట్టు చీఫ్ సూపరింటెండెంట్ పద్మశ్రీ, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ గోపాల్‌నాయక్ సోమవారం తెలిపారు. మొత్తం 265 మంది విద్యార్థులకు గాను 234 మంది ఈ పరీక్షలు రాశారన్నారు.

క్రైం న్యూస్ ..

కానిస్టేబుల్‌పై దాడి - కేసు నమోదు

ధర్మవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్థానిక కదిరిగేటు సమీపంలో ఆదివారం రాత్రి ఓ కానిస్టేబుల్‌పై ఎగ్ సెంటర్ బండి నిర్వాహకుడు రాజు దాడి చేయడంతో అతనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ రెడ్డప్ప తెలిపారు. కదిరిగేటు వద్ద రాజు ఎగ్ సెంటర్ బండి నిర్వహిస్తున్నాడు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ విశ్వనాథ్ ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో అక్కడికి వెళ్లాడు. సమయం దాటి పోయిందని, బంద్ చేయాలని సూచించాడు. కానీ రాజు బంద్ చేయకపోగా కానిస్టేబుల్‌లో గొడవ పెట్టుకున్నాడు. రాజు అతనికి మద్దతుగా మరికొందరు కానిస్టేబుల్‌పై దాడికి దిగారు. దీంతో కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

కారు బోల్తా - ఇద్దరికి తీవ్రగాయాలు

బత్తలపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్వాలాపురం క్రాస్ వద్ద సోమవారం రాత్రి కారు బోల్తా పడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కదిరి చెందిన శ్రీనివాస్ నాయక్, రాథోడ్ బత్తలపల్లి వైపు నుంచి కదిరి వైపు కారులో బయలుదేరారు. జ్వాలాపురం క్రాస్ వద్దకు రాగానే రోడ్డుపై తాటికాయల తొక్కలు రోడ్డుపై వేసి ఉండటంతో.. వాటిపై వెళ్లిన కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులోని వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హైవే అంబులెన్స్‌లో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి .. రోడ్డుపై ఉన్న తాటి తొక్కలను తొలగించారు.

ఇరువర్గాల ఘర్షణ

కొత్తచెరువు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టు ఘర్షణకు దారి తీసింది. స్థానికంగా ఉన్న ఇరువర్గాలు ఆదివారం రాత్రి గొడవపడ్డాయి. ఓ వర్గానికి చెందిన వ్యక్తి ఇంటిలోని కంప్యూటర్, ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. ఇరువర్గాల వారిని తహసీల్దార్ ఎదుట సోమవారం బైండోవర్ చేశామని సీఐ సురేశ్ తెలిపారు. మతపెద్దలు ఇరువర్గాలను రాజీ చేశారు.

చోరీ కేసులో దోషికి శిక్ష

కొత్తచెరువు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాల చోరీ కేసులో దోషికి కోర్టు జైలు శిక్ష ఖరారు చేసింది. ధర్మవరం మండలం ఉప్పునేసినపల్లి గ్రామానికి చెందిన అమర్‌నాథ్ నాయుడిపై 2021లో బంగారు ఆభరణాల చోరీ కేసు నమోదైంది. కోర్టు విచారణలో అతను నేరం చేసినట్లు రుజువు కావడంతో పుట్టపర్తి జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయాధికారి రాజేశ్ సోమవారం దోషికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ డీఎస్ సురేశ్, కానిస్టేబుల్ చంద్రానాయక్, ఏపీపీ బాబూరాజేంద్రప్రసాద్ ఛేదించారు.

గంజాయి విక్రేతల అరెస్టు

బత్తలపల్లి ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్వాలాపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సోమవారం బత్తలపల్లిలో గంజాయి విక్రయిస్తుండగా అరెస్ట్ చేశామని ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. వారి వద్ద ఉన్న 190 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.



సమస్యలు వింటున్న అధికారులు

విద్యుత్ అదాలత్‌కు 28 ఫిర్యాదులు

ధర్మవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విద్యుత్ అదాలత్‌కు 28 ఫిర్యాదులు అందాయి. పుట్టపర్తి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరాములు, విశ్రాంత న్యాయాధికారి శ్రీనివాస, ఆర్థిక సభ్యుడు రామ్మోహనరావు, సాంకేతిక సభ్యుడు అంజనీకుమార్, స్వతంత్రసభ్యులు విజయలక్ష్మీ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 28 ఫిర్యాదులు రాగా.. అందులో ఐదింటిని అక్కడికక్కడే పరిష్కరించామని, మిగిలిన 23 ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని శివరాములు తెలిపారు. సంబంధిత అధికారులతో విచారణ చేయించి వాటినీ పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ లక్ష్మీనరసింహారెడ్డి, ఏఓ రామస్వామి, ఏఈలు నాగభూషణం, కొండారెడ్డి రజానకీరామయ్య, శివయ్య, రవి పాల్గొన్నారు.

సబ్‌జైలు తనిఖీ

ధర్మవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ధర్మవరం సబ్‌జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సోమవారం తనిఖీ చేశారు. ఆయన ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సబ్‌జైలు సూపరింటెండెంట్ కెవీ బ్రహ్మంరెడ్డి, న్యాయవాదులు నూర్ మహమ్మద్, బాల సుందరీ, షామీర్‌బాషా ఉన్నారు.

న్యూస్ బాక్స్

కాశీ విశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న స్వామివారు

పెనుకొండ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధిచెందిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అష్టమిని పురస్కరించుకుని అర్చకులు రాఘవేంద్రచారి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, ఆకు పూజ తదితర పూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు.

సమస్యలులేని గ్రామంగా తీర్చిదిద్దుతాం


వార్డుల్లో పర్యటిస్తున్న టీడీపీ నాయకులు, కమిషనర్

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీని సమస్యలులేని గ్రామంగా తీర్చిదిద్దుతామని కన్వీనర్ శ్రీరాములు పేర్కొన్నారు. మంత్రి సవిత ఆదేశాలతో పట్టణంలోని 20వార్డుల్లో సమస్యలు గుర్తించాలని వాటన్నింటిని ఒక్కొక్కటిగా అధికారులకు తెలిపి పరిష్కరించాలని టీడీపీ శ్రేణులకు, కమిషనర్ సతీష్‌కుమార్‌కు మంత్రి సూచించారు. సోమవారం అర్బన్ కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, విద్యుత్, గృహనిర్మాణం, రేషన్‌కార్డు తదితర సమస్యలను బాధితులు నాయకుల దృష్టికి తెచ్చారు. వీటన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, రామలింగ, రఘువీరా, షౌకత్, బాబిరెడ్డి, జనసేన శ్రీదేవి, రమణమ్మ పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


చిన్నారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కరస్పాండెంట్

పెనుకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి గ్లోబుల్‌జెన్ పాఠశాలలో కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. కిండర్‌గార్డెన్ పూర్తిచేసి ప్రాథమిక తరగతులకు వెళ్తున్న పిల్లలకు సర్టిఫికెట్లను కరస్పాండెంట్ అందించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే ఒక వేదిక అని, వారి జీవితాల్లో ముఖ్యమైన మైలురాయి అన్నారు.

విద్యార్థినికి సన్మానం

ప్రగతి గ్లోబుల్‌జెన్ పాఠశాలలో పదవతరగతి చదివిన పెనుకొండ పట్టణానికి చెందిన విద్యార్థిని తేజశ్విని జేఈఈ మెయిన్స్-1లో జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచి 108ర్యాంక్ సాధించడంపట్ల కరస్పాండెంట్ శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. ఆ విద్యార్థినితోపాటు తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు.

హజ్ కమిటీ సభ్యుడికి సన్మానం


డైమండ్‌బాబాను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

హిందూపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఏపీ హజ్ కమిటీ సభ్యుడు బాబాఫక్రుద్దీన్‌ను ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు. సోమవారం ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యాలయంలో ఉపాధ్యాయులు ఇమ్రాన్‌ఖాన్, జబీవుల్లా, వసీం శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థికి..


విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

హిందూపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చర్చి పాస్టర్ రెవరెండ్ స్టీఫెన్‌రాజ్ కుమారుడు ఇమాన్యువల్‌రాజ్‌ను సత్కరించారు. ఇమాన్యువల్‌రాజ్ గత ఏడాది డిసెంబర్ 1న హల్లెల్ మ్యూజిక్ స్కూల్‌ఆధ్వర్యంలో గిన్నీస్ వరల్డ్ రికార్డ్‌లో చోటు కోసం 1046మంది సంగీత కళాకారులు గంటలోనే కీబోర్డు వాయించి ఇన్‌స్టాగ్రాంలో అప్లోడ్‌చేసి విజయం సాధించాడు. ఈ విషయంపై ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో రాజుకు సర్టిఫికెట్, గోల్డ్‌మెడల్ అందజేశారు. సీఅండ్‌జీ మిషన్‌చర్చి, మిషన్‌కాంపౌండ్ చర్చి లో ఏర్పాటు చేసిన అభినందనసభలో వక్తలు అతనిని అభినందించారు. కార్యదర్శి నాగేంద్రకుమార్, కోశాధికారి సాల్మన్‌రాజ్, జాయింట్ కార్యదర్శి అరుణ్‌కుమార్, దేవరాజ్, డీకెన్ బోర్డు సభ్యులు ఆంజనేయులు, రూబెన్‌పాల్, జార్జిబాబు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రొద్దం గ్రామంలో టీడీపీ నాయకులు శ్రీరామప్ప ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పిడుగుపాటుకు కొట్టం దగ్ధం

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దేబండ గ్రామ వ్యవసాయ పొలంలో ఆదివారం సాయంత్రం పిడుగుపడి రైతు నారాయణప్ప కొట్టం దగ్ధమైంది. రూ.5లక్షలు ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గ్రామానికి చేరుకుని నారాయణప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి జరిగిన నష్టంపై ఆరాతీశారు. పిడుగుపాటువల్ల ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, భూమిపత్రాలు కాలిపోయి రూ.5లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ట్రస్ట్ సభ్యులు రూ.10వేలు ఆర్థిక సాయం అందించి నిత్యావసర సరుకులు అందించారు. ట్రస్ట్ సభ్యులు నాగార్జున, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, బాబుల్‌రెడ్డి, రామక్రిష్ణ, పోతిరెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించండి

● బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత


డీఎస్సీ అభ్యర్థులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి

సోమందేపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషిచేయాలని మంత్రి సవిత సూచించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. గ్రామ స్వరాజ్యం గ్రామాల అభివృద్ధితోనే సాధ్యం అవుతుందని ముఖ్యమంత్రి కలలు కంటున్నారన్నారు. ఆయన కలలను సాకారం చేయాలంటే అధికారుల సహకారం అవసరమన్నారు. అధికారులు, నాయకులు సమన్వయంతో గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేయాలన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి

పంచాయతీలను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు మంత్రి సవిత సూచించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీలవారీగా నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నాయకులు తమ తమ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను మంత్రికి వివరించారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, భూసమస్యలు మంత్రి దృష్టికి తెచ్చారు. వ్యక్తిగత సమస్యలు పక్కనపెట్టి పార్టీకోసం, పంచాయతీ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. డీబీ ఆంజనేయులు, నీరుగంటి చంద్ర, వెంకటరాముడు, వెంకటేశులు, సిద్దలింగప్ప, సూరీ, కిష్టప్ప, సూర్యనారాయణ, ఆకుల రమణ, నాగరాజుయాదవ్, మద్దిలేటి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

చెప్పిన విధంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి సోమవారం మంత్రి సమక్షంలో డీఎస్సీ అభ్యర్థులు క్షీరాభిషేకం చేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ మాది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమన్నారు. విద్యారంగంలో అనేక సంస్కరణలకు లోకేష్ శ్రీకారం చుట్టారన్నారు. చంద్రబాబు జన్మదినం సందర్భంగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఈ విద్యా సంవత్సరానికి 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర చరిత్రలో 1.80లక్షలు ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేసిన ఘనత ముఖ్యమంత్రిదేనన్నారు.

వైసీపీ దగాకోరు ప్రభుత్వం

డీఎస్సీ పేరుతో ఐదేళ్లు కాలయాపనచేసి నిరుద్యోగ యువతను మోసం చేసిన దగాకోరు ప్రభుత్వం వైసీపీ అని మంత్రి సవిత మండిపడ్డారు. ఒక ఉపాధ్యాయ పోస్టు సైతం భర్తీచేయలేదని ఎద్దేవా చేశారు. సోమవారం వెలుగు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. జగన్ అసమర్థతవల్ల నిరుద్యోగుల విలువైన సమయం వృథా అయిందన్నారు.

మాట తప్పని నాయకుడు చంద్రబాబు

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నాయకులు

మడకశిర టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట తప్పరని, ఎన్నికల్లో మాట ఇచ్చిన విధంగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి మరో మారు మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామి, డీఎస్సీ అభ్యర్థులతో కలసి ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం 5 సంవత్సరాల కాలంలో ఇదిగో డీఎస్సీ అదిగో డీఎస్సీ అంటూ కాలం గడిపిందన్నారు. నిరుద్యోగులకు కుచ్చుటోపీ పెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌దే అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, విద్యామంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యాక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంజీవిని సీఎం సహాయ నిధి

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు సంజీవిని లాంటిదని టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. సోమవారం అనారోగ్యాలతో బాధపడుతూ సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకొన్న 9 మంది బాధితులకు రూ.4.50లక్షలు చెక్కులను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి ఎమ్మెల్యే అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా అనారోగ్యంతో బాధపడుతూ సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకొన్న ప్రతి ఒక్కరికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని, అందులోనూ వేగంగా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. కేవలం 9 నెలల్లో వంద మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేసినట్లు తెలిపారు. సీఎం నియోజకవర్గంలో పర్యటించినప్పుడు ఇచ్చిన హామీలతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వేగంగా నెరవేర్చేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మార్కెట్ యార్డ చైర్మన్ గురుమూర్తి, డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రాజ్యాంగంలో మహిళలకు పెద్దపీట వేసిన అంబేడ్కర్


కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పావగడ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలో మహిళలకు, పురుషులకు సమాన హక్కులు కల్పించి రాజకీయ సామాజిక ఆర్థిక బలం చేకూర్చిన ఘనత డా.బీఆర్ అంబేడ్కర్‌దేనని జిల్లా పంచాయతీ మాజీ ఉపాధ్యక్షులు ఎంకే నారాయణప్ప అన్నారు. సోమవారం మీనకుంటపల్లి గ్రామంలో నిర్వహించిన అంబేడ్కర్ 134, బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతిలో పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ జీవితంలో గడిపిన చేదు ఘటనలను భవిష్యత్తులో తన జనం అనుభవించకూడదని ముందుగానే గ్రహించి రాజ్యాంగంలో పేదలకు రక్షణ, ఆర్థిక బలం, చేకూర్చాలని ప్రత్యేక రాజ్యాంగం రచించారన్నారు. మహిళలు జ్యోతులు మోస్తూ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.

ముందస్తు అడ్మిషన్లపై నిరసన


పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహించడంపట్ల పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తుగా ప్రచారాలు చేస్తున్నారని అడ్మిషన్లు చేసుకుంటున్నారన్నారు. ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని, దీనికితోడు పాఠ్యపుస్తకాలు, ఇతర సామగ్రి కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి భగత్, నందీష్, రాజు, దిలీప్, నరేష్, అక్షయ్, నరేంద్ర, లోకేష్ పాల్గొన్నారు.

తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి


డీటీకి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుడిబండ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అంజి, తిప్పేష్, వినోద్, నందీష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డీటీ రాంభూపాల్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి రూ.15వేలు చొప్పున తల్లికి వందనం పథకాన్ని అమలుచేసి వెంటనే వారి తల్లుల ఖాతాలకు జమచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన రోజే చెప్పారని, ఆ మాట ప్రకారం ఈ విద్యా సంవత్సరానికి పథకాన్ని అమలు చేయాలని కోరారు.

24న కలెక్టరేట్ వద్ద ధర్నా


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

సోమందేపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం 24న చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు కంబాలప్ప, రవి కోరారు. సోమవారం స్థానిక వాల్మీకి సర్కిల్‌వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నా తలపెట్టామన్నారు. నాయకులు ఆదిరెడ్డి, నారాయణప్ప, నాగరాజు, సరస్వతమ్మ, సాకమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

ప్రజాపోరాటంతోనే పావగడకు తాగునీరు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జల వేదిక సభ్యులు, స్వామీజీలు

పావగడ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తాలుకా వ్యాప్తంగా ప్రజలు చేపట్టిన సుదీర్ఘ పోరాటాల ఫలితమే నేడు పావగడకు తుంగభద్ర తాగునీరు రావడానికి ఆస్కారమైందని బీజేపీ రైతు మోర్చా ఉపాధ్యక్షుడు, జలవేదిక అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. సోమవారం ఎస్ఎస్‌కే రంగ మందిరంలో నిర్వహించిన పోరాటయోధుల సన్మాన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి మాట్లాడారు. పావగడకు అన్ని విధాలా అన్యాయం జరిగినప్పటికీ స్వచ్ఛంద సేవా సంస్థలు, రైతు సంఘం నాయకులు, దళిత సంఘాలు పాదయాత్రలు చేపట్టి ప్రభుత్వానికి వినిపించేలా నినదించి పావగడకు తాగునీరు తీసుకురాగలిగామని మాజీ ఎంపీ జనార్దన్‌స్వామి అన్నారు. శాంతి మార్గంలో పోరాటం చేసినందుకే నేడు ప్రజలు స్వచ్ఛ నీరు తాగుతున్నారని సర్వధర్మ శాంతి పీఠం అధ్యక్షుడు రామ్మూర్తి స్వామీజీ అన్నారు. సిద్దల కవి, శివచార్య, స్వామీజీ, తిమ్మారెడ్డి, రైతు సంఘం నాయకులు పూజారప్ప, నరసింహారెడ్డి, పురుషోత్తంరెడ్డి, జీటీ గిరీష్, స్మిత నాయుడు పాల్గొన్నారు.

సబ్‌జైలులో కులవివక్షకు తావులేదు

జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్


హిందూపురం సబ్ జైలులో ఖైదీల గదులను పరిశీలిస్తున్న శివప్రసాద్ యాదవ్

హిందూపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సబ్‌జైలులో కుల వివక్షకుతావులేదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ అన్నారు. సోమవారం హిందూపురం సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. జైలులో ఉన్న నిందితుల వివరాలు, ఏం నేరంపై వచ్చారని ఆరాతీశారు. సబ్‌జైలులోనివారు కులాలుచెప్పుకుని వివక్షకు గురికాకూడదన్నారు. వారికి అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. నిందితుల బంధువులు తరచూ న్యాయవాదులను కలిసి వారి కేసులపై తెలుసుకోవాలన్నారు.

పెనుకొండ టౌన్: సబ్‌జైలులో ఉన్న ఖైదీల ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించవద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ అన్నారు. సోమవారం స్థానిక సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. ఖైదీలతో సమావేశం ఏర్పాటుచేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిస్థితులు బాగాలేక న్యాయవాదులు పెట్టుకోలేనివారికి ప్రభుత్వమే న్యాయవాదిని నియమిస్తుందన్నారు. అనంతరం పరిసరాలు పరిశీలించారు. న్యాయవాది శరత్‌బాబు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి

● మున్సిపల్ చైర్మన్ రమేష్


మాట్లాడుతున్న చైర్మన్ రమేష్

హిందూపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. సోమవారం నేతాజీ మున్సిపల్ పాఠశాలలో జరిగిన పాఠశాల వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదవాలన్నారు. ఉపాధ్యాయులు కూడా పాఠాలేకాకుండా క్రమశిక్షణ, ఉన్నత విలువలు కలిగిన విద్యను అందించాలన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు అందించారు. కౌన్సిలర్ నాగేంద్రమ్మ, విద్యాకమిటీ చైర్మన్ పాండురంగ, రేష్మ, ఉపాధ్యాయులు కృష్ణమోహన్, నాగప్ప, టీడీపీ నాయకుడు శివ పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడండి

హిందూపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నీటి సమస్య తలెత్తకుండా అధికారులు, సిబ్బంది పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ రమేష్ ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసులుతో కలిసి నీటి విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య రాకుండా జాగ్రత్త పడాలన్నారు. ముఖ్యంగా పైప్‌లీకేజీలు ఎక్కడెక్కడున్నాయో తెలుసుకుని వాటిని అరికట్టాలన్నారు. పట్టణంలో ప్రతి వార్డులో వారంలో రెండుసార్లైనా నీరిచ్చే విధంగా చూడాలన్నారు. కొంతమంది నీటి విభాగం సిబ్బందిపై ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటివారు ప్రజలపట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. లేదంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఐదు శాతం వడ్డీ మాఫీతోపాటు, జరిమానాలు 50శాతం, పన్నుపై ఐదు శాతం తగ్గింపుపై ప్రజలకు తెలియజేసి పన్నులు కట్టించాలన్నారు. ఇన్‌చార్జి డీఈ ఆనంద్‌రాజ్, ఏఈలు జనార్దన్, ధీరజ్ పాల్గొన్నారు.

177 జీఓను రద్దు చేయాలి: ఏపీటీఎఫ్



మాట్లాడుతూన్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్

మడకశిర రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే 117 జీఓను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరు శ్రీనివాసులు చంద్ర మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణల పేరుతో ప్రయోగాలు చేసి విద్యారంగాన్ని విధ్వంసం చేసిందన్నారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలను ఏర్పాటుచేస్తే ప్రస్తుత ప్రభుత్వం ఎనిమిది రకాల పాఠశాలలను తీసుకురావడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 1, 2 తరగతులలో ఫౌండేషన్ స్కూల్ పేరుతో ప్రాథమిక, ప్రాథమికోన్న పాఠశాలలను గ్రామాల్లో ప్రభుత్వం ఎత్తివేయాలని ప్రయత్నిస్తోందన్నారు. జిల్లా కార్యదర్శి రామకృష్ణ, మండల అధ్యక్షులు జయరాంరెడ్డి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

అగళి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. 87 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా అందులో 66మంది హాజరై పరీక్షలు రాసినట్లు ఆయన తెలిపారు. 21మంది గైర్హాజరయ్యారని వివరించారు. డిపార్ట్‌మెంట్ అధికారి ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పరిగి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి సోమవారం మృతిచెందారు. పోలీసులు తెలిపిన మేరకు మండలంలోని విట్టాపల్లికి చెందిన రవికుమార్ (37) తన అత్త ఊరైన రొద్దం మండలం కొత్తపల్లి గ్రామానికి వెళ్లి ఆదివారం తిరుగు ప్రయాణంలో పైడేటి గ్రామ సమీపంలో ఉన్న సుబ్రమమణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డాడు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు జమేదార్ శ్రీనివాసులు తెలిపారు. మృతుడు కూలి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య హరిత, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్

మడకశిర టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమరాయనిపల్లి గ్రామం సమీంలో సోమవారం మధ్యహ్నం పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు అర్బన్ సీఐ నాగేష్ బాబు తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం విలేకరులతో సీఐ మాట్లాడారు. సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా 20 మంది పేకట ఆడుతుండగా కొంత మంది అక్కడి నుండి పారిపోగా నలుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 4సెల్‌ఫోన్‌లు, 4 ద్విచక్ర వాహనలుతో పాటు రూ.90,070 స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం.. చిన్నారికి అస్వస్థత

గోరంట్ల, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరంగంవాండ్లపల్లికి చెందిన నాగరత్నమ్మ విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబ కలహాల కారణంగా నాగరాజు భార్య నాగరత్నమ్మ పంటపొలాలకు వేసే మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గోరంట్ల పట్టణంలోని మసీదు సర్కిల్ వద్దనున్న ఒకటిన్నరయేళ్ల బాలుడు అబ్‌జాన్ పొరపాటున ఫినాయిల్ తాగి అస్వస్థతకు గురయ్యాడు. అక్బర్‌ఖాన్ కుమారుడైన అబ్‌జాన్ ఇంటిలో ఫినాయిల్‌తో శుభ్రం చేస్తుండగా, దానిని తాగేశాడు. వెంటనే తల్లిదండ్రులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువురిని డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

లేపాక్షి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కొడికొండ-శిర జాతీయ రహదారి లేపాక్షి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు లేపాక్షి గ్రామానికి చెందిన ఓబులేసు అనే వ్యక్తి ద్విచక్రవాహనంలో పొలం వద్దకు వెళ్తున్నాడు. జాతీయరహదారిని దాటే క్రమంలో హిందూపురం నుంచి చిలమత్తూరు వైపు కారు వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హైవే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.